సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న నర్సింహులు యాదవ్

శామీర్‌పేట్: సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న నిరుపేదలకు వరమని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, కేశవరం గ్రామానికి చెందిన ఉప్పెన కృష్ణవేణికి రూ. 60 వేలు, కాసుల మల్లేష్ కు రూ. 27,500. ల చెక్కులను ఆదివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శేఖర్, మైనార్టీ నాయకుడు యూసుఫ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలి


వైద్యశాలను ప్రారంభిస్తున్న మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్

పోచారం: వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలని పోచారం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం అన్నోజిగూడలోని ప్రకాష్‌నగర్‌లో వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక చికిత్సతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైద్యుడిని దేవుడితో సమానంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, డాక్టర్ శివకృష్ణ, రమేష్, మల్లేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



మల్లాపూర్: దేవాలయ అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని అనంతరామ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ నాగలక్ష్మినగర్ కాలనీలోని నందీశ్వరాలయంలో నాగదేవత, నవగ్రహాల చుట్టూ రూ.21 వేలతో గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. కమిటీ సభ్యులు ఆయనను పీజీ సుదర్శన్, శ్రీహరిగౌడ్, రాజేష్ అలయ అర్చకులు మనోజ్ పంతులు సత్కరించారు.

పొంచి ఉన్న ప్రమాదం


ఈస్ట్ ఇందిరానగర్‌లో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇందిరానగర్‌లో అంతర్గత రోడ్డులో రహదారి పక్కన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి నూతన మ్యాన్‌హోల్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

ఆర్థిక తోడ్పాటుకు పురపాలక శాఖ లోక్ కల్యాణ్ మేళా

- రుణ పరిమితి 3 విడతల్లో రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పెంపు
- పీఎం స్వనిధి కింద ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ.
- నగర శివారు మేడ్చల్,రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 34 పురపాలక సంఘాల్లోని వీధి వ్యాపారులకు లబ్ధి

పట్టణాల్లో వీధి వ్యాపారుల సామాజిక భద్రతకు కేంద్రం చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నా వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తోంది. గత ఐదేళ్లుగా వీధి వ్యాపారులకు అందించే ప్రధానమంత్రి స్వనిధి రుణాలను తిరిగి పొందేందుకు చర్యలు చేపట్టారు. గత నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు శిబిరాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయగా, దీని గడువు ఈనెల 15 వరకు పొడిగించారు. లోక్ కల్యాణ్ మేళా పేరుతో వీధి వ్యాపారులకు లక్ష్యం కంటే అధిక రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. కొత్తగా రుణాలు తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. పాత వారికి కూడా రుణ మొత్తాన్ని పెంచడంతో ఆర్థిక అవసరాలు తీరనున్నాయి. సామాజిక భద్రత కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అనుసంధానం చేసి ఆయా పథకాలకు అర్హులుగా ఎంపిక చేస్తారు..నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాలలో 34 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో కూరగాయలు, కొబ్బరి బోండాలు, తోపుడు బండ్లపై పండ్లు, బజ్జీల వంటి విక్రయాలు, ప్రధాన కూడళ్లలో దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకోవడం, తదితర వారందరినీ ఈ పథకంలో చేర్చనున్నారు.

రుణ పంపిణీ సులభతరం

పునరుద్దరించిన పీఎం స్వనిధి పథకం కింద కొత్తగా దరఖాస్తులను ప్రోత్సహించనున్నారు. ఇప్పటికే మంజూరైన దరఖాస్తులను రుణ పంపిణీ సులభతరం చేయడం, బ్యాంకుల్లోని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఆహార విక్రేతలకు శిక్షణ వంటివి ఇవ్వనున్నారు.

వీధి వ్యాపారులకు ప్రత్యేక శిక్షణ

ఆహార పదార్థాలు విక్రయించే వారికి నాణ్యమైన ఆహార పదార్థాలు, కల్తీ లేకుండా వినియోగించడం, తదితర అంశాలపై రెండు విడతలుగా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ ఇప్పించడం, ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ ఎగ్రిగేటర్లు, టౌన్ వెండింగ్ కమిటీలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఎన్జీఓలు, విక్రేతల సంఘాలు తదితర ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయనున్నారు.

రుణ పరిమితి పెంపు..

పీఎం స్వనిధి కింద గతంలో రూ.10 వేలు రుణం అందించగా లోక్ కల్యాణ్ మేళా పేరుతో ఆ మొత్తాన్ని పెంచారు. మొదటి విడతలో రూ.15 వేలు, సక్రమంగా చెల్లిస్తే రూ.25 వేలు, రెండు విడతలు సరిగ్గా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు అందిస్తారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం


మాట్లాడుతున్న దేవేందర్, విజయ్‌కుమార్

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న బీసీ గణనలో పాల్గొని మేము ఎంతో మాకు అంత అని చట్ట సభలో రిజర్వేషన్లు సాధించేందుకు పోరాటం చేయాలని కోలి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవేందర్‌ముదిరాజ్, విజయ్‌ముదిరాజ్, కార్యనిర్వాహక సభ్యుడు సుదర్శన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ బీసీ రిజర్వేషన్, మహిళలు పురుషులతో సమాన హక్కుల కోసం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారన్నారు. 60 దేశాల రాజ్యాంగాన్ని చదివి భారతదేశానికి అనుగుణంగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగం రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, దాసు, రాందాసు, మల్లేశ్, నర్సింగ్‌రావు, ఈశ్వర్, సురేశ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం


అమ్మవారి నిమజ్జన ఊరేగింపు

ఘట్‌కేసర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్ టెర్మినల్ ఎదురుగా గోల్డెన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహ నిమజ్జనం ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఊరేగించి చిన్న చెరువులో నిమజ్జనం చేశారు. బ్యాండ్ మేళాలకు అనుగుణంగా యువత చేసిన డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కుక్కల బెడద నివారించండి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు అన్నారు. ఆదివారం కళావేదిక వద్ద జరిగిన సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో పలు సమస్యలపై కమిటీ చర్చించింది. కుక్కల బెడద, పార్కింగ్ సమస్య, దుకాణాల ఏర్పాటు అంశాలపై తీర్మానాలు చేశారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి

ఘట్‌కేసర్: లారీని ఓ కారు ఢీకొన్న ఘటనలో గాయపడిన బాలిక చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఇన్స్పెక్టర్ బాలస్వామి స్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ మండలం, కొందుర్గుకు చెందిన దోపరల్లి సుధాకర్ కారులో లక్ష్మీ నర్సింహ్మా స్వామి దర్శనం కోసం శనివారం యాదగిరిగుట్టకు బయల్దేరారు. ఘట్‌కేసర్ ఘనాపూర్ వద్దకు రాగానే ఓఆర్‌ఆర్‌పై వేగంగా వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని వెనక వైపు నుంచి ఢీకొట్టడంతో ఆయన కుమార్తె నిహారిక (13)కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఘట్‌కేసర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిహారిక ఆదివారం ఉదయం మృతి చెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా కారు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సామాజిక సేవలో లయన్స్ క్లబ్ తోడ్పాటు



అల్వాల్: సమాజ సేవకులకు లయన్స్ క్లబ్ గౌరవాన్ని అందిస్తుందని డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.ఇన్నారెడ్డి అన్నారు. ఆదివారం నేరెడ్‌మెట్‌లో జరిగిన కార్యక్రమంలో శానిటరీ కార్మికులకు, పోలీస్ అధికారులను లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. వారు మాట్లాడుతూ.. సమాజ సేవలో కార్మికుల పాత్ర కీలకమని వివరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కళ్లెం కృష్ణారెడ్డి, లయన్ కృష్ణప్రసాద్, లయన్ సురేష్‌కుమార్, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనే ఆర్ఎస్ఎస్ ధ్యేయం


శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు, స్థానికులు

ఘట్‌కేసర్: దేశంలో శాంతి నెలకొల్పడంలో ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) ప్రముఖ పాత్ర పోషిస్తుందని భాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ వంశీకృష్ణ అన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మున్సిపాలిటీలోని మర్పల్లిగూడలో ఆదివారం నిర్వహించిన శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం మేలు కోసం నిత్యం గంట సమయం శాఖకు కేటాయించాలని, సంఘానికి సమయం ఇవ్వడమంటే సమాజ అభివృద్ధికి కృషి చేయడమేన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి సరిహద్దు దేశాలు, దేశంలోని దుష్టశక్తులు ఎదురు చూస్తున్నాయన్నారు. ప్రజలందరూ ఐక్యతతో ఉంటే ఎవరూ మనల్ని ఏమీ చేయలేరని దేశంలో శాంతి నెలకొనాలంటే ప్రతి ఇంటిలో స్వయం సేవక్ ఉండాలని, లక్షలాది స్వయం సేవకులను తయారు చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ శ్రీశైలం, స్వయం సేవకులు, స్థానికులు పాల్గొన్నారు.

రంగనాయక స్వామి ఆలయంలో సుదర్శన హోమం


సుదర్శన్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీ గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై ఊరేగించారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు ఫణీకుమారాచార్యులు, పవనాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణం కోసం సుదర్శన హోమం నిర్వహించామని, హోమం ద్వారా వచ్చిన కట్న కానుకలు ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకం


విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: సమాజ నిర్మాణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పాత్ర కీలకమని మల్కాజిగిరి గో సేవ ప్రముఖ్ పంతంగి బాలమురళీకృష్ణ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కీసర బండ్లగూడలో విజయదశమి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచపరివర్తన ద్వారా సమాజంలో గొప్ప మార్పులు తీసుకురావచ్చన్నారు. సమాజ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. వందేళ్లుగా సమాజ నిర్మాణంలో పాలుపంచుకుంటుందన్నారు. కార్యక్రమంలో దొంతిరి సాయిరామ్‌రెడ్డి, మొగుళ్ల శ్రీకాంత్ రెడ్డి, సానాల వెంకటచారి, ఆనంద్‌రావు, స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.


సాయి సంజీవన్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గం ఏర్పాటు

కీసర: నాగారం మున్సిపాలిటీ సాయి సంజీవన్‌నగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా ఎస్.విజయ్, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ్, కోశాధికారిగా లక్ష్మీప్రసాద్, ఉపాధ్యక్షులుగా రమేష్, రవిచంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా చందన్‌కుమార్, హరి, అజయ్, ప్రశాంత్‌రెడ్డి, జాయింట్ కోశాధికారులుగా కిషోర్‌బాబు, చందన్, జాయింట్ కార్యదర్శి కార్యదర్శులుగా తిరుమలేష్, శివప్రసాద్, కల్చరల్ కార్యదర్శులుగా రఘు, కార్తీక్, స్పోక్ పర్సన్‌గా సత్యదేవ్, మహిళ విభాగం మౌనిక, సీమకుమారి, దివ్య, స్వర్ణరెడ్డి, సలహాదారులుగా శ్రీనివాస్‌రావు, నారాయణ, సుధాకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాహుల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనంతరెడ్డి, హరిబాబు, వెంకట్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్ గౌడ్ పాల్గొన్నారు.

ఓయో లాడ్జ్‌ను మూసి వేయాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఘట్కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్, అన్నోజిగూడ , భగత్ నగర్ కాలనీ (గేటెడ్ కమ్యూనిటి)లో చట్ట విరుద్ధంగా కాకతీయ గ్రాండ్ హోటల్, కంపెనీ- సర్వీసెస్ హోటల్ 'ఓ ' పేరుతో నిర్వహిస్తున్న ఓయో/ లాడ్జ్‌ను వెంటనే సీజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సత్యప్రకాష్,ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర ,సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా నాయకులు చింతల యాదయ్య, సబిత, మహిళా సంఘం జిల్లా నాయకురాలు సృజన , బీజేపీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్ వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. అన్నోజిగూడలో ఓయో పేరుతో హోటల్ నిర్వహిస్తున్న భవనానికి మున్సిపాలిటీ నుంచి రెసిడెన్షియల్ అనుమతి మాత్రమే ఉందన్నారు.ఆ భవనానికి వాణిజ్య కార్యకలాపాలకు నిర్వహించటానికి ఎలాంటి సీఎల్‌యూ , ట్రేడ్ లైసెన్స్, పోలీస్ ఎన్‌ఓసీ, ఫైర్ సేఫ్టీ, హెల్త్ సర్టిఫికేట్ లేవన్నారు. రాత్రి సమయంలో ఆ ప్రాంతంలో అనుమానిత వ్యక్తుల రాకపోకలు పెరగటంతోపాటు భద్రత సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అర్ధరాత్రి దాటాక ఓయో గదుల్లో పార్టీలు నిర్వహిస్తుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సదరు భవనానికి వాహన పార్కింగ్ లేకపోవటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. స్థానిక మున్సిపల్, పోలీసులు అధికారులు సత్వరమే భవనాన్ని సీజ్ చేయటంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే అభినందన


మారథాన్ రన్నర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: 130వ బోస్టన్ మారథాన్ రేసుకు అర్హత సాధించిన మల్లాపూర్‌కు చెందిన మారథాన్ రన్నర్ చాలమలశెట్టి నాగభూషణంరావును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 74 ఏళ్ల వయస్సులో అమెరికా బోస్టన్‌లో జరగబోయే మారథాన్ రేసుకు అర్హత సాధించి, యువతకు స్ఫూర్తినిచ్చారన్నారు. యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ తరపున మరిన్ని మారథాన్ పోటీల్లో పాల్గొని దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రహదారులు ఛిద్రం !


దెబ్బతిన్న చిలుకానగర్ రహదారి

ఉప్పల్: ఇటీవల కురుస్తున్న వర్షాలు, నిర్వహణలోపంతో చిలుకానగర్ గుంతమయంగా మారింది. రహదారి పొడవునా అడుగుకో గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయ ఏర్పడుతోంది. రోడ్డు గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఛిద్రమైన రోడ్డుపై డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతూ.. వాహనదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. కోట్లాది రూపాయలతో డివిజన్లను అభివృద్ధి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అవి కేవలం మాటలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలున్నాయి.

◆ ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి నుంచి కావేరినగర్ నాలా మీదుగా చిలుకానగర్ చౌరస్తా వరకు దాదాపుగా రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. దారిపొడవునా నిత్యం వేలాది వాహనాలు వెళ్లే మార్గం కూడా ఇదే. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, వివిధ పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ఇలా రోజుకు వేలాదిగా ప్రయాణం సాగిస్తుంటారు.

◆ ఉప్పల్ నుంచి నేరుగా బీరప్పగడ్డ, కావేరినగర్, చిలుకానగర్, నాచారం హేమనగర్, బోడుప్పల్, మల్లాపూర్ తదితర ప్రాంతాలకు ప్రధానంగా వెళ్లే ప్రధాన రహదారి కావడం వల్ల నిత్యం ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. రోజూ ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నాయి.



రోడ్డుకు గుంతలు ఏర్పడి 2-3 ఏళ్లు అవుతోంది. స్థానికులమంతా కలిసి అనేకసార్లు జీహెచ్ఎంసీలో ఫిర్యాదు చేశాం. ఆఫీస్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. నాచారం, మల్లాపూర్‌లో ఉన్న పెద్ద పెద్ద స్కూళ్లకు వెళ్లే సమయాల్లో విద్యార్థులు, వారిని తీసుకెళ్లే తల్లిదండ్రులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

– నరేంద్ర, స్థానికుడు

రూ.6 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం

కొత్త రహదారి ప్రతిపాదనకు రూ. 6 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రోడ్డు టెండర్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. మొదటి దశగా డ్రైనేజీ పైపులైన్ చిలుకానగర్ బాబూజగ్జీవన్‌రాం చౌరస్తా నుంచి కావేరి నగర్ నాలా వరకు పనులు పూర్తైతే రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– ఈఈ హరిలాల్

రోడ్డు మరమ్మతులు చేపట్టండి సారూ..

- గుంతలమయంగా మూడుచింతలపల్లి- కీసర రోడ్డు
- ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


గుంతలమయమైన రహదారిలో వాహనదారుల అవస్థలు


కుంటను తలపిస్తున్న రోడ్డు

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మూడుచింతలపల్లి – కీసర రోడ్డు గుంతల మయంగా మారింది. శాలవాని కుంట సమీపంలో భారీ గుంతలు ఏర్పడడంతో నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. దీంతో రోడ్డులో గుంత ఎక్కడ ఉందో రోడ్డు ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం తమ పరిధి కాదంటూ ఆర్ అండ్ బి, ఇరిగేషన్, స్థానిక మున్సిపల్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కీసర వైపు వెళ్లే వారికి ఈ రోడ్డు ఒక్కటే ఆధారం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ప్రతీ రోజు పదుల సంఖ్యలో ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. స్థానిక నాయకులు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వార్తా పత్రికల్లో కథనాల వచ్చినా అధికారుల్లో స్పందన కరువైంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.